# వరికి మద్దతు ధర ఇవ్వాల్సిందే

EENADU - 23.05.11

**• జయప్రకాష్ నారాయణ్ డిమాండ్**

గోస్పాడు - న్యూస్‌టుడే

"పొలంలో కష్టపడి పంటను పండించే ప్రతి రైతూ మద్దతు ధర కోసం పోరాడాలి. నంద్యాలలో ఆ సంగ్రామానికి అంకురార్పణ జరగాలని లోక్‌సత్తా పార్టీ అధినేత డా. జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు. ఆదివారం కర్నూలు జిల్లా గోస్పాడు మండలం యాళ్లూరులో రైతు సమాఖ్య ఆధ్వర్యంలో రైతు చైతన్యయాత్ర జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 44 లక్షల ఎకరాల్లో రూ. కోటి 30 లక్షల టన్నుల వరి పండించారన్నారు. కర్నూలు జిల్లాలో రబీలో 15వేల ఎకరాల్లో 4 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అయ్యిందన్నారు. "ప్రభుత్వం 2కోట్ల గోనె సంచులు పంపించామంటున్నారు. అవి 45 కేజీలవే కావడంతో క్వింటాకు రెండున్నర సంచుల చొప్పున కేవలం 8లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకే సరిపోతాయి. అరకొర లెక్కలతో.. ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది" అని ధ్వజమెత్తారు. ఇంత వరకు నల్గొండ జిల్లాలో 2లక్షల టన్నులు, మిగతా అన్ని జిల్లాల్లో 2 లక్షలు టన్నులు మాత్రమే కొనగలిగారని... వంద బస్తాలకు ఆరు బస్తాలే కొన్నారన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. రోడ్లపైన కుప్పలుగా పోసిన ధాన్యం పరిస్థితి ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎక్కువ స్థాయిలో కొనుగోలు చేసి ధాన్యం అవసరం ఉన్న రష్యా, చైనా వంటి దేశాలకు ఎగుమతి చెయొచ్చు కదా అని సూచించారు. ఉద్యోగులు జీతం కోసం, రాజకీయనాయకులు అధికారానికి, రైతులు ధర కోసం పనిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘాల సమాఖ్య ప్రధానకార్యదర్శి బొజ్జా దశరథరామిరెడ్డి, భారతీయ రైతు సంఘం సమాఖ్య ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి చెంగళరెడ్డి, ఆచార్య ఎన్‌జీరంగా వర్సిటీ పాలకవర్గ సభ్యుడు పోచా బ్రహ్మానందరెడ్డి తదితరులు ప్రసంగించారు. పలువురు రైతు నేతలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేపీ